AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
19-11-2025 (Wednesday)
MAIN EDITION

## హిందుత్వం వల్లే గెలిచాం: బండి సంజయ్



**అక్షరటుడే, కరీంనగర్ :** కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నోటి నుంచి హిందుత్వం అని రాకపోతే తన శ్వాస ఆగినట్టే అని అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో ఆయన మాట్లాడారు. హిందుత్వం వల్లే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు గెలిచామని బండి సంజయ్ తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా మోదీ ప్రభుత్వం అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు. హిందుత్వ వాదంతోనే గడగడపకు తిరుగుతానని స్పష్టం చేశారు. తెలంగాణలో రామరాజ్యాన్ని తీసుకొస్తామన్నారు.

## భారత్‌పై 25శాతం టారిఫ్‌లు తగ్గించాలి




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** భారత్‌పై 25శాతం సుంకాలు తగ్గించాలని మేథోసంస్థ జీటీఆర్ఐ (గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్) అమెరికాను కోరింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించిన నేపథ్యంలో తమ దేశ వస్తువులపై టారిఫ్‌లు కొనసాగించడం అన్యాయమని వాదించింది. రష్యా చమురు కొనుగోలును భారత్ గణనీయంగా తగ్గించిందని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా పేర్కొన్నారు. ఆ దిగుమతుల వల్లే సుంకాలు విధించామని, ఇప్పుడు వాటిని తగ్గిస్తామని ఇటీవల సంకేతాలు ఇచ్చారు.

## తగ్గనున్న చలితీవ్రత..



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో చలి గజగజ వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. సాయంత్రం 6 దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. అయితే రాష్ట్రంలో చలి ప్రభావం గురువారం నుంచి తగ్గుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## అగ్రస్థానం కోల్పోయిన రోహిత్ శర్మ



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కోల్పోయాడు. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ (782 పాయింట్లు) రెండు స్థానాలు ఎగబాకి నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. రోహిత్ (781) రెండో స్థానానికి పడిపోయాడు.

## మళ్లీ 26 వేల ఎగువకు నిఫ్టీ



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత కోలుకున్నాయి. ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ 26 వేల మార్కును అందుకుంది.

## శబరిమలలో భారీగా భక్తుల రద్దీ..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** శబరిమల అయ్యప్ప ఆలయంలో భక్తుల రద్దీ భారీగా నెలకొంది. భక్తుల సంఖ్య అకస్మాత్తుగా పెరగడంతో దర్శనం కోసం వేచి ఉండే సమయం 10 గంటలకు పైగా పెరిగింది. ఈ తీవ్ర రద్దీ మధ్య ఓ మహిళా భక్తురాలు స్పృహ కోల్పోయి మరణించిన ఘటన దిగ్భ్రాంతికి గురి చేసింది. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఛైర్మన్ జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 58 ఏళ్ల మహిళా భక్తురాలు దర్శనం కోసం క్యూలో వేచి ఉండగా స్పృహ తప్పి కుప్పకూలింది. వెంటనే వైద్య సిబ్బంది పరిశీలించగా ఆమె అక్కడికక్కడే మరణించినట్లు నిర్ధారించారు. మృతురాలు కోజికోడ్ జిల్లాలోని కోయిలాండికి చెందిన మహిళ అని తెలిపారు.

## పోలీసుల వాహనంతో రీల్స్.. కేసు నమోదు

**అక్షరటుడే, ఆదిలాబాద్ :** సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి కొందరు నానా తంటాలు పడుతున్నారు. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఇద్దరు యువకులు ఏకంగా పోలీస్ వాహనంలో రీల్స్ చేశారు. ఈ ఘటన ఆదిలాబాద్‌లో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసుల వాహనంతో ఇద్దరు యువకులు రీల్స్ చేశారు. అది కాస్త వైరల్ అయింది. దీంతో ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఏసీబీ వరుస దాడులు కలకలం రేపుతున్నాయి. అవినీతిపరులను బెంబేలెత్తిస్తున్నాయి. అవినీతి నిరోధక శాఖ రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేస్తుండడం లంచావతారులకు గుబులు పుట్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ అధికారులు ఇటీవల దూకుడు పెంచారు. ప్రజల ఫిర్యాదుల మేరకు అవినీతి అధికారులను వలపన్ని పట్టుకుంటున్నారు. అంతేగాకుండా పలు కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. మంగళవారం ఒక్కరోజే ఏసీబీ మూడు కేసులు నమోదు చేసింది. నలుగురిని అరెస్ట్ చేసింది. ఈ నెల 14న 23 ఏసీబీ బృందాలు రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టి లెక్కల్లో చూపని నగదు స్వాధీనం చేసుకుంది.**

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# ఏసీబీ దూకుడు..

■ నిత్యం ఎక్కడో ఒకచోట దాడులు ■ వారంలో మూడు ఘటనలు ■ అవినీతిపరుల్లో గుబులు ■ సగటున రోజుకో కేసు నమోదు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏసీబీకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చింది. దీంతో అవినీతి నిరోధక శాఖ ఏసీబీ స్వేచ్ఛగా పనిచేస్తోంది. ఫలితంగా రోజుకో కేసు నమోదవుతోంది. మంగళవారం ఒక్కరోజే మూడు కేసులు నమోదు చేసింది. ఓ ఎస్సైతో పాటు ఓ సర్వేయర్, చైన్‌మన్, విద్యుత్ శాఖ ఏఈని ఏసీబీ అరెస్టు చేసింది. దొంగతనం కేసు విషయంలో మెదక్ జిల్లా టెక్మల్ ఎస్సై రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడి చేసింది. అధికారులను చూసి పోలీస్‌స్టేషన్ గోడ దూకిపారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి మరీ అధికారులు పట్టుకున్నారు. ఇక, సికింద్రాబాద్ మండల సర్వేయర్ సైతం ఓ పని కోసం రూ.లక్ష లంచం తీసుకుంటుండగా, ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటున్న వనపర్తి జిల్లా గోపాల్‌పేట ఏఈ హర్షవర్ధన్ రెడ్డిని సైతం అరెస్ట్ చేసింది. అంతకు ముందు రోజు ముగ్గురు అధికారులు ఏసీబీకి దొరికిపోయారు. ఇలా నిత్యం ఎక్కడో ఒక చోట ఏసీబీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. గత జనవరి నుంచి ఆగస్టు వరకు అధికారిక లెక్కల ప్రకారం.. ఏసీబీ రాష్ట్రవ్యాప్తంగా 179 కేసులను నమోదు చేసింది.

### కఠిన చర్యలు లేకే..

అవినీతి నిరోధక శాఖ లంచావతారుల ఆట కట్టిస్తోంది. సగటున రోజుకో కేసు నమోదు చేస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల్లో మార్పు రావడం లేదు. ఏళ్ల తరబడి విచారణలు కొనసాగడం, కఠిన చర్యలు లేకపోవడంతో ఉద్యోగుల్లో భయమన్నదే లేకుండా పోయింది. ఏసీబీకి పట్టుబడుతున్న ఉద్యోగులు.. నాలుగు రోజులు సస్పెన్షన్‌కు గురవుతున్నారు. ఆ తర్వాత పై అధికారులను మచ్చిక చేసుకుని సస్పెన్షన్ ఎత్తేయించుకుని విధుల్లో చేరుతున్నారు. కేసులు నమోదు మీద దృష్టి సారిస్తున్న ఏసీబీ.. నిందితులకు న్యాయస్థానంలో కఠిన శిక్షలు విధించేలా చేయడంలో విఫలమవుతోంది. ఏళ్ల తరబడి కేసుల విచారణ కొనసాగుతుండడం కూడా అక్రమార్కులకు కలిసి వస్తోంది. మరోవైపు, ప్రభుత్వం వైపు నుంచి కూడా క్రమశిక్షణ చర్యలు లేకపోవడంతో పరిస్థితి అదుపు తప్పుతోంది.

ఇటీవల ఏసీబీకి పట్టుబడిన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గతంలోనూ లంచం తీసుకుంటూ దొరికాడు. ఏదో మొక్కుబడిగా సస్పెండ్ చేసిన అధికారులు.. ఆ తర్వాత ఎత్తేయడంతో విధుల్లో చేరాడు. మళ్లీ లంచాలు తీసుకోవడం మొదలు పెట్టాడు. మొదటిసారి తప్పు చేసినప్పుడే అతడ్ని ఉద్యోగం నుంచి తొలగించి ఉంటే మిగతా వారు భయపడే వారు. కానీ ఆ పరిస్థితి లేకపోవడంతో అక్రమార్కులకు అడ్డే లేకుండా పోయింది.

### చేయి తడిపితేనే ఫైల్ కదిలేది..

ప్రభుత్వ శాఖల్లో అంతులేని అవినీతి పెరిగిపోయింది. ఏ శాఖలో అయినా పని కావాలంటే పైసలు ఇవ్వాల్సిందే. లేకపోతే పని కాదు.. ఫైల్ ముందుకు సాగదు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, రవాణా, స్టాంపులు, రిజిస్ట్రేషన్ వంటి కీలక శాఖల్లో లంచాల దందా పెరిగిపోయింది. ఏదైనా సర్టిఫికెట్ కావాలన్నా, బిల్లు రావాలన్నా, ఫైల్ ముందుకు కదలాలన్న పైకం ఇస్తేనే సరి. లేకపోతే ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. కింది స్థాయి నుంచి పైదాకా అంతా అవినీతి పర్వమే. ఈ నేపథ్యంలో లంచాలు ఇవ్వలేని కొంత మంది ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. పైసల కక్కుర్తితో పని చేయకుండా వేధిస్తున్న ఉద్యోగుల ఆట కట్టిస్తున్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీని బుధవారం ప్రారంభించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆయన నెక్లెస్ రోడ్డులోని ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం చీరల పంపిణీ ప్రారంభించారు. రాష్ట్రంలో మహిళా సంఘాల సభ్యులకు బతుకమ్మ పండుగకు చీరలు పంపిణీ చేస్తామని గతంలో ప్రభుత్వం తెలిపింది. అయితే చీరలు సిద్ధం కాకపోవడంతో పంపిణీని వాయిదా వేసింది. తాజాగా ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరలను అందించనుంది. ఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, సీతక్క, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఐటీ సోదాలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఐటీ సోదాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. నగరంలోని పలు ప్రముఖ హోటళ్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల ఇళ్లలో మంగళవారం అధికారులు తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే బుధవారం సైతం సోదాలు నిర్వహించారు. నగరంలోని పిస్తా హౌజ్, షా గౌస్, మైహిఫిల్ హోటళ్ల నిర్వాహకుల ఇళ్లలో అధికారులు తనిఖీలు చేపట్టారు. అయితే ఆదాయ పన్ను చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. రాజేంద్రనగర్‌లోని పిస్తా హౌస్ ఓనర్లు మహమ్మద్ మజీద్, మహమ్మద్ అబ్దుల్ మోషీ ఇళ్లలో రెండు రోజులుగా తనిఖీలు చేస్తున్నారు. అలాగే హోటల్ వర్కర్లకు సంబంధించిన నివాసాల్లో సైతం పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కీలక డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు సీజ్ చేశారు.

## ప్రేమకు ప్రతిరూపం సత్యసాయి : మోదీ

**అక్షరటుడే, అమరావతి :** పుట్టపర్తిలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఆయనకు గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఘన స్వాగతం పలికారు. ప్రధాని మాట్లాడుతూ.. సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని చెప్పారు. భౌతికంగా లేకున్నా.. ఆయన ప్రేమ మనతోనే ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో ఎంతో మందికి ఆయన బోధనలు మార్గం చూపాయన్నారు. కోట్ల మంది ఆయన భక్తులు మానవ సేవ చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని సత్యసాయి స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ఆవిష్కరించారు.



## ఏపీలో ఎన్‌కౌంటర్.. ఏడుగురు మావోల మృతి



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లో మరో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ లడ్డా తెలిపారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నక్సల్స్ కీలక నేత మాడ్వి హిడ్మా, ఆయన భార్య రాజేతో పాటు మరో నలుగురు మృతి చెందారు. అయితే అటవీ ప్రాంతంలో మరికొంత మంది మవోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు బలగాలు నిన్నటి నుంచి కూంబింగ్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో మావోయిస్టు నేత దేవ్‌జీ ఉన్నట్టుగా సమాచారం.

## మావోయిస్టులు లొంగిపోవాలి : మల్లోజుల



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పరిస్థితులు మారుతున్నాయి.. దేశం కూడా మారుతోందని ఇటీవల లొంగిపోయిన మావోయిస్ట్ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులు లొంగిపోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. ఏపీలో మావోయిస్ట్ అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ అయిన విషయం తెలిసిందే. దీనిపై మల్లోజుల స్పందించారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన పేర్కొన్నారు. హిడ్మాతో పాటు పలువురి ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగించిందన్నారు. అందుకే లొంగిపోవాలని ఆయన కోరారు.

## రాత్రికి రమ్మంటూ టార్చర్ చేశారు..



బాలీవుడ్‌లో ఒకప్పుడు హాట్ బ్యూటీగా సంచలనం సృష్టించిన మల్లికా షెరావత్.. తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తెరపై బోల్డ్ పాత్రలు చేసిన ఈ నటి, వెనకటి రోజుల్లో ఇండస్ట్రీలో ఎదుర్కొన్న కష్టాలను మరోసారి బయటపెట్టింది. క్యాస్టింగ్ కౌచ్‌పై మాట్లాడుతూ.. రాజీకి ఒప్పుకోలేదనే కారణంతో తన చేతిలో సినిమా ఆఫర్స్ పూర్తిగా తగ్గిపోయాయని మల్లికా ఎమోషనల్‌గా చెప్పింది. గతంలోనూ ఇలాగే స్పందించింది. 'చాలా మంది పెద్ద హీరోలు రాత్రి సమయంలో కలవాలని అడిగేవారు. నేను ఎందుకు అలా వెళ్లాలి? తెరపై బోల్డ్‌గా నటించానని నిజ జీవితంలో కూడా అలా వ్యవహరించాలన్నట్లా? నేను అలా చేయను. వారి మాటలకు రాజీ పడలేదు' అని చెప్పింది.

-అక్షరటుడే, సినిమాడెస్క్